



అమలాపురం జనసేనకే?

» అధిష్ఠానం నుంచి సమాచారం అందిందంటూ శెట్టిబత్తుల రాజబాబు వర్గీయుల సంబరాలు

» టీడీపీకే కేటాయించాలని ఆ పార్టీ శ్రేణుల డిమాండ్ » వేడెక్కుతున్న అమలాపురం రాజకీయాలు

అమలాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గంలో ఆసక్తికరమైన రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈ సీటును జనసేన అభ్యర్థి శెట్టిబత్తుల రాజబాబుకు ఖరారు చేశారంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం రాత్రి గడియారస్తంభం సెంటర్లో సంబరాలు జరుపుకున్నారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు రాత్రి 9.45 గంటల సమయంలో భారీగా బాణసంచా కాల్చారు. జై జనసేన, జై రాజబాబు అంటూ నినాదాలు ఇచ్చారు. అమలాపురం టిక్కెట్టును రాజబాబుకు ఖరారు చేసినట్టు పార్టీ అధిష్ఠానం నుంచి తమకు సమాచారం అందించిందని, దాంతోనే సంబరాలు చేసుకున్నామని జనసేన అధ్యక్షుడు పిండి రాజా, నాయకుడు ఆకుల బుజ్జి మీడియాకు వెల్లడించారు. అయితే ఆ సమయంలో బాణసంచా కాల్పులను పోలీసులు వచ్చి అడ్డగించారు. రాజబాబును అత్యధిక మెజార్టీతో గెలిపించి పవన్‌కు కానుకగా ఇస్తామని ఆ పార్టీ నాయకులు ప్రకటించారు. అయితే జనసేనలోని డీఎంఆర్ శేఖర్ వర్గీయులు ఈ ప్రచారాన్ని తప్పుపడుతున్నారు. అధిష్ఠానం టిక్కెట్టు ప్రకటించలేదని, ఇది శెట్టిబత్తుల రాజబాబు వర్గం ఆడుతున్న మైండ్‌గేమ్‌లో భాగమని వారంటున్నారు.



రాత్రి సమయంలో సంబరాలు జరుపుకుంటున్న శెట్టిబత్తుల రాజబాబు వర్గీయులు

ఇదిలా ఉండగా టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో మెట్ల రమణబాబు ఇంటి వద్ద జరిగిన పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి భారీ సంఖ్యలో కార్యకర్తలు నేతలు హాజరయ్యారు. బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే జెండా బహిరంగ సభకు జనసమీకరణే లక్ష్యంతో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ హాజరైన నాయకులు, కార్యకర్తలంతా అమలాపురం స్థానాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ టీడీపీకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ప్రసంగాలు చేశారు. మార్చి 3వ తేదీలోగా టిక్కెట్లపై పార్టీ అధిష్ఠానాలు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్న దృష్ట్యా ఆ రోజు వరకు పార్టీ కేడర్ అంతా సమన్వయం పాటించాలని టీడీపీలోని మెజార్టీ వర్గీయులు నిర్ణయించారు. టిక్కెట్లు వెల్లడైన అనంతరం భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని టీడీపీ పరిశీలకులుగా వచ్చిన నేతల ముందు తమ మనోగతాన్ని వెల్లడించారు. మొత్తం మీద అమలాపురంలో జనసేనలోని రెండు వర్గాలు, ఇటు టీడీపీ వర్గం ఎవరికీ వారే వ్యూహాత్మకంగా చేస్తున్న ప్రకటనలతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.



తెలుగుదేశం పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు



టీడీపీ సమావేశం జరుగుతున్న హాలులోకి చొచ్చుకు వెళ్తున్న జనసైనికులు, హరీష్‌తో వాగ్వివాదం (ఇన్‌సెట్‌లో)

రాజేష్ మాకొద్దు

» అంబాజీపేటలో టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుండగా హాలులోకి దూసుకొచ్చిన జనసైనికులు

» కుర్చీలు, బల్లలు ధ్వంసం చేసి రాజేశ్‌కు వ్యతిరేకంగా నినాదాలు » హరీష్‌మాధుర్ కారు అద్దాలు ధ్వంసంతో తీవ్ర ఉద్రిక్తత

అంబాజీపేట, ఫిబ్రవరి 27: పి.గన్నవరం ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి సరిపెల్ల రాజేష్ (మహాసేన రాజేష్)పై వ్యతిరేకత రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే టీడీపీ కార్యాలయానికి తాళాలు వేయడంతో పాటు పలువురు నేతలు ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఇదిలా వుండగా మంగళవారం అంబాజీపేటలో జరిగిన టీడీపీ నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం ఉద్రిక్తత పరిస్థితుల నడుమ రసాభాసగా ముగిసింది. జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు, కోనసీమ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, పరిశీలకుడు షేక్ సుభాన్, అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో జనసైనికులు మహాసేన రాజేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. కుర్చీలు, బల్లలను ధ్వంసం చేసి విధ్వంసం సృష్టించారు. మహాసేన రాజేష్ గో బ్యాక్ అంటూ టీడీపీ, జనసైనికులు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. హరీష్ మాధుర్ కారు అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి తీవ్రరూపం దాల్చడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. అనంతరం ముఖ్య నేతలు సమన్వయ కమిటీ సమావేశాన్ని కొనసాగించి ఇక్కడి పరిస్థితులను టీడీపీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించారు.

ప్రధాన వార్త మెయిన్‌లో

టీడీపీ, జనసేన నేతల అభిప్రాయాలను

అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా

టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు

అంబాజీపేట, ఫిబ్రవరి 27: పి.గన్నవరం నియోజకవర్గ టీడీపీ సమన్వయ కమిటీ సమావేశం అంబాజీపేటలోని వాసవికన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో మంగళవారం జరిగింది. టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయకృష్ణరంగారావు, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో మండలాల వారీగా నేతలతో భేటీ అయ్యారు. టీడీపీ అభ్యర్థి సరిపెల్ల రాజేష్ (మహాసేన రాజేష్)పై టీడీపీ, జనసేన నేతల అభిప్రాయాలను తెలుసుకున్నారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. వైసీపీని గద్దెదించేందుకు టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రత్యేక దృష్టిసారిస్తున్నారన్నారు. వారి అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకువెళ్తానని జోన్-2 ఇన్‌చార్జి సుజయ రంగారావు తెలిపారు. సమావేశంలో టీడీపీ నేతలు దాసరి వీర వెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, సూదా బాబ్జీ, సలాది పుల్లయ్యనాయుడు, చిట్టూరి శ్రీనివాస్, బొంతు పెదబాబు, మొల్లేటి శ్రీనివాస్, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, చిన్నం బాలవిజయరావు, అరిగెల బలరామమూర్తి, బొండాడ నాగమణి, జనసేన జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, అరిగెల సూరిబాబు, అడబాల తాతకాపు, దొమ్మేటి సాయికృష్ణ, సుంకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి సుజయ కృష్ణ రంగారావు



దేవదాయశాఖ అధికారులు, ద్రాక్షారామ ఆలయ అర్చకులు, వేద పండితులను సత్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఆలయాల అభివృద్ధిపై దృష్టి సారించాలి

» అంతర్వేదిలో శాశ్వత ప్రాతిపదికన కల్యాణ మండపం నిర్మాణానికి చర్యలు: కలెక్టర్ హిమాన్షు శుక్లా

» అంతర్వేది, ద్రాక్షారామ దేవస్థానాల అధికారులు, అర్చకులు, వేద పండితులకు కలెక్టరేట్‌లో సత్కారం

అమలాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. ఆగమ శాస్త్ర ప్రకారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మండపాన్ని శాశ్వత ప్రాతిపదికన నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దాతల సహకారంతో దేవస్థానాల్లో ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపడతామన్నారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం, ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన ఈవోలు, వేద పండితులను కలెక్టర్ శుక్లా శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు, అంతర్వేది సహాయ కమిషనరు వీవీఎస్ సత్యనారాయణ, కోనసీమ జిల్లా సహాయ కమిషనరు నాగమల్లేశ్వరరావులను వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ కలెక్టర్ సత్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.



అంతర్వేది ఆలయ అధికారులు, అర్చకులను సన్మానించిన కలెక్టర్

రక్షిత అటవీ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలి: కలెక్టర్

అమలాపురం, ఫిబ్రవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజర్వు ఫారెస్ట్, రక్షిత అటవీ భూములపై సమగ్ర సర్వే నిర్వహించి జేసీకి నివేదిక సమర్పించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి తొలి అటవీ రక్షణ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లాలోని రిజర్వు రక్షిత అటవీ భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే సమావేశం నాటికి సర్వే పూర్తిచేసి నివేదిక అందించాలన్నారు. కాట్రేనికోన మండలం కందికుప్ప, కొత్తపాలెం తదితర ప్రాంతాల్లో ఉన్న 400 ఎకరాల భూమిని ఉమ్మడి సర్వే చేసి రిజర్వు చేసిన ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఆక్రమణల్లో ఉన్న రిజర్వు అటవీ భూముల్లో ఎన్ని ఎకరాల్లో చేపల చెరువులు విస్తరించి ఉన్నాయో నివేదిక అందించాలన్నారు. మడ అడవుల లభ్యతపై సమగ్ర సర్వే నిర్వహించాలన్నారు. వన సంరక్షణ సమితుల నిర్వహణకు నూతన కమిటీల ఎన్నికను డీఎస్‌వో చేపట్టాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు మాట్లాడుతూ ఆక్రమణల తొలగింపునకు అవసరమైన చర్యలను కలెక్టర్, ఎస్పీ తీసుకోవాలని కోరారు. జిల్లాలోని రిజర్వు ఫారెస్టు ప్రాంతాల్లో ఆక్రమణలకు గురికాకుండా సహాయ సహకారాలు అందించాలని పోలీసు అధికారులను కోరారు. మడ అడవులు అందుబాటులో ఉన్నాయని, వాటిని రక్షిత అడవులుగా ప్రకటించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, తహసీల్దారు సునీల్ కుమార్, సర్వే శాఖ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మూడు ప్రాంతాల్లో జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర దినోత్సవం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: జిల్లాలోని మూడు ప్రాంతాల్లో జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి తెలిపారు. ఈ నెల 28న జాతీయ విజ్ఞాన సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో విస్తృతంగా విజ్ఞానశాస్త్ర ప్రదర్శనల నిర్వహణకు కృషి చేయాలని పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు. జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లాలోని పాశర్లపూడి, దంగేరు, కె.గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జిల్లా స్థాయి విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు.

తూనికలు, కొలతల శాఖలో ఉద్యోగుల కొరత...

సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: తూనికలు, కొలతల శాఖలో ఉద్యోగుల సంఖ్య తగ్గినందున రిజిస్ట్రేషన్ల ప్రక్రియను గ్రామ, వార్డు సచివాలయాలకు అప్పగించామని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ పేర్కొన్నారు. తూనికలు, కొలతలకు వినియోగిస్తున్న పరికరాల రిజిస్ట్రేషన్లను నిర్దేశిత యాప్‌లో



చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఎమినిటీస్‌లను ఆదేశించారు. చాలా సులభమైన ప్రక్రియ కాబట్టి నాలుగైదు రోజుల్లో సర్వే పూర్తిచేసి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముగించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి జేసీ నుపూర్‌అజయ్ జిల్లాలోని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సచివాలయాల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జగనన్న పాలవెల్లువ ద్వారా అమూల్ సంస్థ సహకారంతో వచ్చే నెలలో పాల సేకరణ ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముందస్తుగా ఆటోమెటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల ఏర్పాటు కోసం సిద్ధం చేసిన భవనాల్లో మౌలిక సదుపాయాలను పూర్తిచేయాలని ఆదేశించారు. మార్చి 5 నాటికి బల్క్‌మిల్క్ కలెక్షన్ సెంటర్లు సిద్ధం చేయాలన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో రూపొందించిన మొబైల్ యాప్‌లో జిల్లాలోని పరిశ్రమలపై సర్వే చేసి రిజిస్ట్రేషన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో కొలతల శాఖ సహాయ కంట్రోలర్ రాజేష్, డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజరు పీకేపీ ప్రసాద్, పశుసంవర్థక శాఖ సహాయ సంచాలకుడు ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్ల వందనానికి, ఆసరా సభలకు

ప్రజాధనం దుర్వినియోగం

» మున్సిపల్ ఆదాయానికి అధికారులు గండి కొడుతున్నారు

» అధికార, విపక్ష కౌన్సిలర్ల ఆగ్రహం

» వాడివేడిగా అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: అధికారులు మున్సిపల్ ఆదాయానికి గండి కొడుతున్నారని అధికార, విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల వందనం కార్యక్రమంతో పాటు ఆసరా సభల కోసం లక్షలాది రూపాయల ప్రజాధనాన్నిదుర్వినియోగం చేస్తున్నారని విపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యంతో మున్సిపల్ ఆదాయానికి గండి పడుతోందని ధ్వజమెత్తారు. అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన మంగళవారం వాడివేడిగా సాగింది. వలంటీర్ల వందనం కార్యక్రమానికి ఒకే రోజున విడతలు విడతలుగా రూ.3లక్షలకు పైగా ఖర్చు చేయడాన్ని టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. ఆసరా సభ కోసం సుమారు రూ.4.50 లక్షలు ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. దాంతో అధికారపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జన్మభూమి సభలకు కూడా ఇలాగే ఖర్చు చేశారని అనగా ఎప్పుడూ లక్షలు ఖర్చు చేయలేదని, ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించుకునేందుకు కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ కమ్యూనిటీ హాలును వినియోగించుకోవచ్చు కదా అని విపక్ష కౌన్సిలర్లు సూచించారు.

● పదో వార్డు గాంధీనగర్‌లో అనధికార లే-అవుట్‌కు ఎంపీ ల్యాడ్స్ నిధులతో రోడ్డు నిర్మాణాన్ని మరోసారి అజెండాలోకి మొదటి అంశంగా తీసుకురావడంతో వాడివేడిగా చర్చ జరిగింది. అనధికార లే-అవుట్‌కు ల్యాండ్ కన్వర్షన్ ఫీజు చెల్లించారా, సామాజిక స్థలాన్ని విడిచిపెట్టారా అని అధికారపక్ష కౌన్సిలర్ సంసాని చంద్రశేఖర్ ప్రశ్నించగా అధికారులు లేదని చెప్పడంతో మరి రోడ్డు నిర్మాణం ఎలా చేపడతారని మండిపడ్డారు. గతంలో మున్సిపల్ నిధులతో అదే లే-అవుట్‌లో డ్రైన్లు ఎలా నిర్మించారని, తాగునీటి పైపులైన్లు ఎలా వేశారని విపక్ష కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు ప్రశ్నించారు. మరోసారి ఇదే అంశాన్ని వాయిదావేస్తూ పూర్తి సమాచారంతో తీసుకురావాలని తీర్మానం చేశారు.

● పట్టణంలో అనధికార కట్టడాలు పెరిగిపోయాయని, ట్రేడ్ లైసెన్సులు లేనే లేవని, హోర్డింగులు ఎన్ని ఉన్నాయో, బకాయిలు ఎంతో చెప్పాలని 15 రోజుల క్రితం లేఖ అందిస్తేటౌన్ ప్లానింగ్ అధికారులు ఇంతవరకూ సమాధానం చెప్పలేదని కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు విడిచిపెట్టి ఆ తర్వాత నోటీసులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో షాపింగ్ మాల్స్ పెరిగిపోయాయని, అందుకు అనుగుణంగా హోర్డింగులు ఏర్పాటుచేసినా మున్సిపల్ ఆదాయం మాత్రం ఒక్కపైసా పెరగలేదని కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ప్రశ్నించారు. సూపర్ మార్కెట్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తున్నా పన్నులు వేయరా అని ప్రశ్నించారు. అక్రమ కట్టడాలతో పాటు ట్రేడ్ లైసెన్సులపై సర్వే నిర్వహిస్తున్నామని కమిషనర్ ఎస్.మనోహర్ సభ్యులకు వివరించారు.



వాగ్వాదానికి దిగిన అధికార, విపక్ష కౌన్సిలర్లు

● 25వ వార్డులో అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు పెరిగిపోయినా అధికారులు చర్యలు తీసుకోవట్లేదని వార్డు కౌన్సిలర్ దొంగ నాగసుధారాణి ప్రశ్నించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే వాటరు ట్యాంకర్లు మూలనపడి ఉన్నాయని కౌన్సిలర్ తిక్కా సత్యలక్ష్మి పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడే సక్రమంగా తాగునీరు అందించలేకపోతున్నామని, వెంటనే మరమ్మతులు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. వాటరు ట్యాంకర్లకు మరమ్మతులు ఎప్పుడు చేయిస్తారని ప్రశ్నించారు. టెండర్లు వేయడం కాదు అత్యవసరంగా పనులు పూర్తిచేయించి తాగునీరు సరఫరా చేయాలని కోరారు. మరమ్మతులు చేయించేందుకు మీకు ఖాళీ లేకపోతే నేనే దగ్గరుండి చేయిస్తానని వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు సూచించారు.

● మున్సిపల్ పర్మినెంట్ పారిశుధ్య కార్మికులకు కల్పిస్తున్న అన్ని సదుపాయాలను ప్రైవేటు వర్కర్లకు కూడా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిలర్ నాగేంద్ర అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పట్టణంలో దోమల బెడద ఎక్కువైందని, నిర్మూలనకు కనీస చర్యలు తీసుకోకపోవడంతో జ్వర పీడితుల సంఖ్య అంతకంతకూ పెరిగిపోతోందని కౌన్సిలర్ గండి దేవీహారిక సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కమిషనరు మనోహర్ కల్పించుకుని... ఫాగింగ్ మిషన్ల కొనుగోలుకు టెండర్లు పిలిచామని, త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వీధి దీపాల నిర్వహణ అధ్వానంగా ఉందని అధికార, విపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. కిరోసిన్ దీపాల కంటే దారుణంగా బెడ్ బల్బుల మాదిరిగా వెలుగుతున్నాయని, 20 ఓల్ట్‌ల బల్బులు వేస్తారా అని మండిపడ్డారు.

● పాఠశాలల్లో పనిచేస్తున్న కంటింజెంట్‌లకు 9 నెలలుగా జీతాలు లేవని, ఎప్పుడు చెల్లిస్తారని తిక్కా సత్యలక్ష్మి ప్రశ్నించారు. 5వ వార్డులో చేయని పనిని పూర్తి చేసినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారని, ఇప్పటికి పలు పర్యాయాలు కౌన్సిల్ సమావేశంలో అడిగినా ఇంతవరకు పైపులైను నిర్మాణ పనులు పూర్తి చేయలేదని కౌన్సిలర్ బొర్రా చిట్టిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పనికి సంబంధించిన ఫైలు కూడా కనిపించకుండా పోవడం అధికారుల పనితీరుకు నిదర్శనమని మండిపడ్డారు.

● అత్యవసర సమావేశంలో భాగంగా 31 ఎజెండా అంశాలను తీసుకురావడంపై విపక్ష కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు అత్యవసర సమావేశానికి నియమ, నిబంధనలు ఉంటాయా అని ప్రశ్నించారు. దాంతో అధికారులు కల్పించుకుని త్వరలో ఎన్నికల కోడ్ రానుందని, పనులు ప్రారంభించడం కోసం అత్యవసరంగా ఎజెండా తీసుకువచ్చామని వివరించారు. అత్యవసర పనులైతే పర్వాలేదు. సాధారణ పనుల కోసం కూడా ఎజెండాను రూపొందించడం ఏమిటని మండిపడ్డారు. సమావేశంలో కౌన్సిలర్లు తిక్కిరెడ్డి వెంకటేష్, బండారు గోవిందు, కొల్లాటి దుర్గాబాయి, ఆశెట్టి నాగదుర్గ, పిండి అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్బీఐలో చోరీకి విఫలయత్నం




లాకర్లు పగలకొట్టేందుకు చేసిన ప్రయత్నం

బ్యాంకులో సీసీ ఎల్ఈడీ టీవీ పగలగొట్టిన దొంగలు

క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్‌లతో పరిశీలన

ఎటపాక, ఫిబ్రవరి 27: ఎటపాక మండలం, తోటపల్లి ఎస్బీఐ (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)లో సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. బ్యాంకు మెయిన్ గేట్ తాళాలు పగలగొట్టి చోరీకి యత్నించారు. లోపలికి ప్రవేశించిన దొంగలు నగదు కోసం గాలించి, కంప్యూటర్స్, మోనటర్స్, సీపీయూలను ధ్వంసం చేశారు. బ్యాంకు గదిలో ఉన్న సీసీ ఫుటేజ్ రికార్డు అయ్యే ఎల్ఈడీ టీవీని సైతం పగలగొట్టారు. ఈ క్రమంలోనే దొంగలు లోపలి గదిలోని నగదు, బంగారు ఉంచే రెండు స్ట్రాంగ్ రూమ్‌లను పగలగొట్టేందుకు యత్నించి, విఫలమయ్యారు. ఉదయాన్నే బ్రాంచ్ మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ రామారావు, ఎస్ఐ పార్థసారథి బ్యాంకు వద్దకు వచ్చారు. చోరీ జరిగిన తీరును పరిశీలించారు. బ్యాంకులో నగదు, బంగారం అంతా సవ్యంగా ఉండడంతో ఊపిరిపీల్చుకున్నారు. ఆ తర్వాత పోలీసులు బ్యాంకు చుట్టుపక్కల వారిని ప్రశ్నించారు. అయితే సీసీ ఫుటేజీల్లో సుమారు ఆరుగురు దొంగలు ముఖాలు కనబడకుండా రుమాళ్లు కట్టుకుని ఉన్నట్లు గుర్తించారు. వారి వద్ద గొడ్డళ్లు, కర్రలు ఉన్నాయి. పాడేరు నుంచి నలుగురు సభ్యులు క్లూస్ టీం వచ్చి వేలి ముద్రలను సేకరించారు. అలానే కాకినాడ నుంచి డాగ్ స్క్వాడ్ కూడా వచ్చి, దొంగతనం జరిగిన తీరుపై ఆధారాలు సేకరించారు. అయితే ఇదే బ్యాంకులో పదేళ్ల క్రితం దొంగలు చోరీకి యత్నించి విఫలమయ్యారు. పోలీసులు వివిధ కోణాల్లో విచారిస్తున్నారు. కాగా మేనేజర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బ్యాంకు సిబ్బందిని విచారిస్తున్న పోలీసులు



స్వామీజీతో జ్యోతుల కుటుంబం

ఘనంగా మల్లికార్జున కల్యాణం

జగ్గంపేట, ఫిబ్రవరి 27: జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటి పార్థివ లింగ మహా రుద్రాభిషేకంలో భాగంగా మంగళవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచ గవ్య ప్రాసన, రక్షాబంధము, గోపూజ, మహాన్యాస పారాయణ, రుద్రాభిషేకము, మండప పూజలు, బిల్వార్చన, కుంకుమార్చన, సుబ్రహ్మణ్య ఆవాహనం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీ దేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హిందూ దేవాలయ ప్రతిష్ఠాపన పీఠం పీఠాధిపతి శ్రీ కమలానంద భారతి, శృంగేరి పీఠానికి చెందిన బంగారయ్య శర్మ హాజరై మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు తమ స్వహస్తాలతో కోటి పార్థివ లింగాలకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ దైవ చింతన కలిగిన నాయకుడు కారణంగా సమాజాభివృద్ధి జరుగుతుందని చెప్పారు. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి భక్తులు పాల్గొన్నారు.



గంజాయితో పట్టుబడిన నిందితులతో పోలీసులు

గంజాయితో ఐదుగురి అరెస్టు

మోతుగూడెం, ఫిబ్రవరి 27:రెండు వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో పోలీసులు గంజాయితో ఐదుగురిని అరెస్టు చేశారు. డొంకరాయి పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చెక్‌పోస్టు వద్ద సోదాలు చేస్తుండగా పర్నాటి రవి, మట్టాడి ప్రమోద్‌రెడ్డి అనే ఇద్దరు బైక్‌పై ఒడిసాలోని చిత్రకొండ ఏరియా నుంచి ఆరు కిలోల గంజాయిని తీసుకువస్తుండగా పోలీసులకు దొరికిపోయారు. తర్వాత మరో ప్రాంతంలో సోదాలు చేస్తుండగా, విజయవాడ, గుంటూరు ఏరియాకు చెందిన మేకా అమర్‌రెడ్డి, గిరికిన లక్ష్మణ్, షేక్ మహబూబ్ మైనర్‌తో కలిసి పశువుల్లంకలో నాలుగు కిలోల గంజాయిని తీసుకుని వస్తుండగా డొంకరాయి వద్ద పోలీసులు పట్టుకున్నారు. రెండు కేసుల్లో ఐదుగురిని అరెస్టు చేసినట్లు చింతూరు సీఐ గజేంద్రకుమార్ తెలిపారు..

చమురు, గ్యాస్ నిక్షేపాలపై రౌండ్ టేబుల్ సమావేశం

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 27: కాకినాడకు 30 కిలోమీటర్ల దూరాన సముద్ర గర్భం నుంచి ఈ ఏడాది జనవరి 7 నుంచి చమురు ఉత్పత్తి ప్రారంభమైందని, మన తీర ప్రాంతంలో చమురు ఉత్పత్తి కాకినాడ ప్రజలకు జీవనోపాధి అయినందున ఈ నెల 28వ తేదీ ఉదయం 10.30 గంటలకు కాకినాడ గాంధీభవన్‌లో చమురు, గ్యాస్ నిక్షేపాలపై రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, కాకినాడ జిల్లా అభివృద్ధి పోరాట కమిటీ ఛైర్మన్ తాటిపాక మధు వెల్లడించారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ హాజరు కానున్నారన్నారు. అదే విధంగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు, మేధావులు పాల్గొననున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి బోడకొండ తెలిపారు.

ఎలక్ట్రికల్ బైక్ దగ్ధం



రౌతులపూడి, ఫిబ్రవరి 27: రౌతులపూడి గ్రామంలో మోహనరావు అనే వ్యక్తికి చెందిన ఎలక్ట్రికల్ బైక్ సోమవారం రాత్రి దగ్ధమైంది. పార్కు చేసిన కొద్దిసేపటికే బైక్ నుంచి మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. సంవత్సరం నుంచి ఎలక్ట్రికల్ బైక్‌ను వినియోగిస్తున్నట్లు మోహనరావు చెప్పారు.

నేటి నుంచి ఉత్తర క్యాబిన్ రైల్వే గేటు మూసివేత

సామర్లకోట, ఫిబ్రవరి 27: సామర్లకోట-పిఠాపురం ట్రాక్‌లో ఉత్తర క్యాబిన్ వద్ద రైల్వే గేట్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 28 బుధవారం ఉదయం 7 గంటల నుంచి మార్చి 6 సాయంత్రం 7 గంటల వరకూ మూసివేయనున్నట్లు సామర్లకోట రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పబ్లిక్ వే బీవీ శ్రీనివాసరావు మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ మీదుగా కాకినాడ వెళ్లే వాహనదారులు, కాకినాడ నుంచి గాంధీబొమ్మ మీదుగా సామర్లకోటకు చేరుకునే వాహనదారులు ఫ్లైఓవర్ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగించాలని రైల్వే అధికారి తెలిపారు. ప్రయాణికులు ఈ విషయాలను గమనించి రైల్వేశాఖకు సహకరించాలని కోరారు.

బైక్ ఢీకొని యువకుడి మృతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27: కాటన్ బ్యారేజీ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరానికి చెందిన రావిపాటి వెంకటేష్(29) సోమవారం రాత్రి బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి ఇంటికి వస్తుండగా బొబ్బర్లంక బ్యారేజీపై ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. వెంకటేష్ మామయ్య కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

కేంద్రంలో ఈసారి

మాదే అధికారం

పార్టీ శ్రేణులు ప్రజలకు చేరువయ్యేలా పని చేయాలి

కేంద్ర పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాలి

బీజేపీ శ్రేణులకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ దిశానిర్దేశం



రాజ్‌నాథ్‌సింగ్‌కు వెంకన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రంలో ఈ సారీ మాదే అధికారమని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఏపీలోనూ తమ పార్టీ సత్తా చాటుతుందని చెప్పారు. గోదావరి క్లస్టర్ పరిధిలో బూత్ కమిటీ సభ్యులకు మంగళవారం ఏలూరులో రక్షణ మంత్రి దిశా నిర్దేశం చేశారు. అయితే రాబోయే ఎన్నికల్లో తమ పార్టీ ఇతర పార్టీలతో పొత్తుకు సిద్ధపడుతుందా ? ఏదైనా కీలక ప్రకటన చేయబోతారా ? అని ఎదురుచూసిన కేడర్‌కు బీజేపీ అగ్రనేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాశనే మిగిల్చారు. ప్రత్యేకించి అధికార వైసీపీని దుయ్యబడుతూనే, కేంద్రంలో అత్యధిక స్థానాలతో ఎన్‌డీఏ ప్రభుత్వం రాబోతోందని కార్యకర్తల్లో జోష్ పెంచారు. అధికార వైసీపీని ఎడాపెడా కడిగేశారు. పేదలకు గుక్కెడు నీళ్లిచ్చే పథకమైన జలజీవన్ కింద రాష్ట్ర ప్రభుత్వ వాటాగా చెల్లించడానికి దిక్కు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో అవినీతిమయమే కాకుండా, ఒక విజన్ లేని ప్రభుత్వం ఉందని తూర్పారబట్టారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఒక వైపు, బీజేపీయేతర పక్షాల అపజయాలను ఏకరవు పెడుతూనే ఇంకోవైపు బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పథకాలను సవివరంగా వివరించారు. "రామ మందిర నిర్మాణంపై కొందరు అనుమానం లేవనెత్తారు. కానీ అయోధ్యలో బాల రాముడిని ప్రతిష్ఠించాం. అనుకున్నది అనుకున్నట్లుగా క్రతువును పూర్తి చేశాం" అని రాజ్‌నాథ్ ప్రకటించినపుడు సభా ప్రాంగణం హర్షధ్వానాలతో మిన్నంటింది. వేదికపై ఉన్న బీజేపీ నేతలు జైశ్రీరామ్ అంటూ నినదించారు. కార్యకర్తల్లో కనిపించిన జోష్‌ను చూసి బీజేపీ ప్రభుత్వం ఏదైతే చెబుతుందో అదే చేస్తుందన్నారు. రాబోయేది ఏపీలో బీజేపీ ప్రభుత్వమేనని, ఏపీ నుంచి ఎంపీలు ఈసారి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహిస్తారని కొత్త సంకేతాలిచ్చారు. 'ప్రతి కార్యకర్తకు ఒక లక్ష్యం ఉండాలి. దీనికి సరిపడా శ్రమించాలి. ప్రజల నుంచే బీజేపీ నాయకులను తయారు చేస్తోంది. కొన్ని పార్టీలు మాత్రం కుటుంబం గురించే ఆలోచిస్తాయి. ప్రధాని మోదీ వల్ల నవభారత్ ఏర్పడింది" అని రక్షణ మంత్రి వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాకపోవడం ఇప్పటి వరకు ఉన్న ప్రభుత్వాల చేతకానితనం అన్నారు. ఏ పార్టీలో కార్యకర్తలుగా ఉన్నామో ప్రతి బీజేపీ కార్యకర్తా ఒకసారి అర్థం చేసుకోవాలని, మోదీ సూచనతో రష్యా, ఉక్రెయిన్ మధ్య సాగుతున్న యుద్ధాన్ని నాలుగున్నర గంటలు నిలిపివేశారని, 25 వేల మందికిపైగా దేశీయ విద్యార్థులను తరలించారని, ఇదంతా ప్రసంగాలతో అయిపోదని, ఒక కార్యాచరణ ఉంటేనే సాధ్యమని, అది మోదీ ప్రభుత్వానికే ఉందని అన్నారు. పేదలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, సొంత ఇళ్లు వంటి పథకాలు అందుబాటులోకి తెచ్చింది బీజేపీ ప్రభుత్వమేనన్నారు. స్వయం వికసిత భారత్ రావాలనే అందరి ఆకాంక్ష అని, ఇది సాధ్యం కావాలంటే బీజేపీ రాష్ట్రంలోను, కేంద్రంలోను అధికారంలో ఉండాలన్నారు.

డబులింజన్ ప్రభుత్వం రావాలి: తపనచౌదరి

రాష్ట్రంలో డబులింజన్ ప్రభుత్వం రావాల్సిందేనని పోలవరం నిర్మాణం సాధ్యం కావాలన్నా, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగాలన్నా ఇదొకటే ఏకైక మార్గమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయచౌదరి అన్నారు. ఒకప్పుడు రక్షణ విభాగం ఏకే 47 ఆయుధాలను కొనుగోలు చేసేదని, బీజేపీ పాలనలో ఏకే-203 ఆయుధాలను ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వం తయారు చేస్తోందని, ఇది ఘనత కాదా అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ హయాంలో సంక్షేమం, అభివృద్ధి అందరూ అందుకోవచ్చన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి అందరూ అండగా ఉండాలన్నారు. అంతకు ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. సీనియర్ నేత పాకా సత్యనారాయణ మాట్లాడుతూ అందరూ అన్నింటికీ సిద్ధం అంటున్నారని బీజేపీ మాత్రం సేవకే సిద్ధమని ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర సంఘటన్ మంత్రి మధుకర్‌జీ, రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షుడు విక్రం కిశోర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోడూరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణప్రసాద్, అంబికా కృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మలా కిశోర్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, సుభాష్ రాజు, ఈతకోట తాతాజీ, మాజీ మంత్రి కామినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.



సభకు హాజరైన నాయకులు

'వాడపల్లి' అభివృద్ధిపై ధర్మకర్తల మండలి సమీక్ష



ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు అధ్యక్షతన మంగళవారం ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాలపై ప్రణాళిక రూపకల్పన చేశారు. గోదావరి ఒడ్డున స్వామివారికి చెందిన 8.88 ఎకరాల్లో ఐదు అంతస్తుల్లో 500 పడకల కాటేజీని దేవదాయ శాఖ, దాతల సహకారంతో నిర్మాణం చేపట్టేలా తీర్మానించారు. 2024-25లో జరిగే అధ్యయనోత్సవాలు, కల్యాణోత్సవాల నిర్వహణపై సమీక్షించారు. స్వామివారి ఉత్సవాలను ప్రతిఏటా మాదిరిగానే ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. వచ్చేనెల 15,16 తేదీల్లో ఆలయ శిఖర ప్రతిష్ఠ కార్యక్రమంపైనా చర్చించారు. 2024-25 బడ్జెట్‌ను ఆమోదించారు. ఆలయం ఎదురుగా కోనేరు నిర్మాణానికి టెండర్లు పూర్తిచేసినట్టు చెప్పారు. క్షేత్ర పాలకుడు విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని వెంకన్న ఆలయంలో విలీనం చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టారు. స్వామివారికి చెందిన ఈనాం భూములను స్వాధీనం చేసుకునేందుకు తీర్మానించి కమిషనర్‌కు పంపించారు. భక్తుల సౌకర్యార్థం పలు అంశాలపై చర్చించారు. డిప్యూటీ కమిషనరు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్, ధర్మకర్తల మండలి సభ్యులు పి.సురేష్‌రాజు, మన్యం సూర్యకుమారిభాను, మెర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్రమూర్తికి కుంభాభిషేకం



కోటనందూరు, ఫిబ్రవరి 27: కోటనందూరు మండలం పాతకొట్టాం గ్రామంలో ఉన్న శ్రీసీతారామచంద్రమూర్తి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా వేదపండితుల ఆధ్వ ర్యంలో కుంభాభిషేకం, సప్తనదీ జలాలు, పంచామృతాలతో అభిషేకం ఘనంగా నిర్వహించారు. హోమం, వార్షిక కల్యాణం ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళా భక్తులు కలశాలతో గ్రామంలో ఊరేగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించామని ఆలయ వ్యవస్థాపకుడు యడ్ల చెల్లారావు తెలిపారు. అలాగే జగన్నాథపురం గ్రామంలో సుమారు కోటి రూపాయలతో నిర్మించిన శ్రీహనుమత్ సీతా లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీదేవి విగ్రహ స్థాపన మహోత్సవంలో భాగంగా రామాలయంలో గణపతి హోమం, పుణ్యాహవచనం, దీక్ష ధారణ, గోశాల పూజ తదితర పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నర్సరీని సందర్శించిన ఛత్తీస్‌గఢ్ బృందం

కడియం, ఫిబ్రవరి 27: కడియపులంక పుల్లా చంటియ్యాసత్యదేవా నర్సరీని ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జైవిక్ ఖేతి మిషన్ వ్యవసాయ శాఖ అసిస్టెంట్ టెక్నాలజీ మేనేజర్ సంజయ్ మలాకర్‌తో పాటు 75 మంది రైతులు సందర్శించారు. ఈ సందర్భంగా సంజయ్ మలాకర్ మాట్లాడుతూ దేశ, విదేశీ ఉద్యాన సంపద ఒకేచోట ఉన్న ప్రాంతం కడియం అన్నారు. మొక్కల జాతులు, శాస్త్రీయ నామాలు క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. ఉద్యానవన శిక్షకులకు, రైతులకు ఈ ప్రాంతం ఎంతో మేలు చేస్తుందన్నారు. మొక్కల వివరాలను తెలుసుకున్నారు.



ఛత్తీస్‌గఢ్ బృందంలోని సభ్యులు

పిఠాపురంలో భారీ చోరీ

రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు.. నగదు అపహరణ



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

పిఠాపురం, ఫిబ్రవరి 27: పిఠాపురంలో భారీ చోరీ జరిగింది. సుమారు రూ.15 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. పట్టణంలోని రజకవీధిలో వాడపల్లి హేమలత నివాసం ఉంటున్నారు. కుమారుడి వివాహం నిమిత్తం కుటుంబ సభ్యులంతా కలిసి ఈనెల 21న రాజమహేంద్రవరం వెళ్లారు. అక్కడ పెళ్లి పనులు చూసుకుని మంగళవారం పిఠాపురం తిరిగి వచ్చారు. ఇంటికి వచ్చి చూసుకునేసరికి తాళాలు బద్దలు కొట్టి తలుపులు తొలగించి బీరువాల్లో ఉండాల్సిన 25 కాసుల బంగారు నగలు, రూ.3లక్షల నగదు అపహరించినట్లు గుర్తించారు. క్లూస్‌టీమ్, పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. చోరీ సంఘటనపై హేమలత పిఠాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.




బంగారు ఆభరణాల బహూకరణ

అన్నవరం, ఫిబ్రవరి 27: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి మంగళవారం విశాఖపట్నానికి చెందిన అజ్ఞాత భక్తుడు స్వామి,అమ్మవార్లు, శంకరుడికి రూ.17.5 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, నిత్యాన్నదాన పథకానికి రూ.5 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రెండు లక్షలు విరాళంగా అందించారు. వీటిని ఆయన ఆలయ ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, పీఆర్వో కృష్ణారావుకు అందించగా వారు దాతను అభినందించి ప్రత్యేక దర్శనం స్వామివారి ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ భాస్కర్, స్వామీజీ, ఏపీఆర్వో ఎం.గణపతిరావు పాల్గొన్నారు.

పొరపాటున అన్నా.. రాజకీయం చెయ్యొద్దు..

కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి



కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 27 : మత్స్యకార జాతిపై తాను పొరపాటున అన్నానని.. తన వ్యాఖ్యలు రాజకీయం చెయ్యొద్దని... కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర రెడ్డి పేర్కొన్నారు. కాకినాడలో ఎమ్మెల్యే తన నివాసం వద్ద మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యాఖ్యల పట్ల చింతిస్తున్నానన్నారు. కాకినాడలో అన్నికులాలు, మతాల ప్రజలంతా తనకు సమానమేనన్నారు. మత్స్యకార వర్గం అభివృద్ధికి ఎంతో పాటుపడుతున్నానన్నారు. తన వ్యాఖ్యలను మనస్ఫూర్తిగా వెనక్కి తీసుకుంటున్నానని, అన్యథా భావించవద్దని అన్నారు. మత్స్యకారులను కించపరచాలన్న ఎటువంటి ఉద్దేశం తనకు లేదన్నారు. ఎన్నికల సమయంలో తన వ్యాఖ్యలపై కొంత మంది రాద్ధాంతం చేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ వివాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడలో వెంకటేశ్వరస్వామి గుడి కట్టించిన ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రారంభోత్సవానికి ముందు మాట్లాడుతూ రూ.4 కోట్ల సొంత నిధులతో ఈ గుడి నిర్మించినట్లు వెల్లడించారు. ఈ గుడి శంకుస్థాపన సమయంలో రూ.2కోట్ల నిధులు టీటీడీ మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ప్రస్తావిస్తూ ఈ గుడి నిర్మాణానికి టీటీడీ మంజూరు చేసిన రూ.2కోట్ల నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. దీనికి కౌంటర్‌గా ద్వారంపూడి మాట్లాడుతూ రూ.కోటి పెట్టి గుడి కట్టి రూ.10 కోట్లు దండుకునే జాతి కొండబాబు జాతి అని వ్యాఖ్యలు చేశారు. ఈనెల 17న ఎమ్మెల్యే చేసిన ఈ వ్యాఖ్యలపై అప్పటి నుంచి మత్స్యకార వర్గాలు ఆవేదన చెందుతున్నాయి.మత్స్యకారులను కించపరచిన ద్వారంపూడి క్షమాపణ చెప్పాలని పలుచోట్ల మత్స్యకార నాయకులు నిరసనలు తెలిపారు. ఈ వివాదం తలెత్తి పది రోజులవుతున్నా ద్వారంపూడి పట్టించుకోకపోవడంతో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ రంగంలోకి దిగి మత్స్యకారులకు రెండు రోజుల్లోగా క్షమాపణ చెప్పకపోతే ఈ నెల 27న ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటిని ముట్టడిస్తామని ప్రకటించింది. ఇదే సమయంలో ఫిషర్‌మెన్ జేఏసీ, ఆంధ్రప్రదేశ్ సంప్రదాయ మత్స్యకార సంఘాల ఆధ్వర్యంలో కాకినాడలో సోమవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పుదుచ్చేరి మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు మాట్లాడుతూ ద్వారంపూడి వారంరోజుల్లో క్షమాపణ చెప్పకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని అల్టిమేటం జారీ చేశారు. ఈ పరిస్థితుల్లో వివాదం మరింత తీవ్రతరం కాకుండా ఉండేందుకు మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటుచేసి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుంటున్నట్లు ద్వారంపూడి ప్రకటించారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు ఘన నివాళి

రామచంద్రపురం, ఫిబ్రవరి 27: స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 93వవర్ధంతి సందర్భంగా స్థానిక పిల్లవారిస్కూల్‌లో మంగళవారం ఆజాద్‌కు నివాళులర్పించారు. భీమశంకరం అధ్యక్షతన జరిగినకార్యక్రమంలో పీడీఎస్‌యూ నేత బి.సిద్దూ మాట్లాడుతూ ఆజాద్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్ఎం కేవీపీ సత్యనారాయణ, జనవిజ్ఞాన వేదిక పట్టణ కార్యదర్శి ఈశ్వరరావు, అధ్యాపకులు ఈశ్వర్ రామకృష్ణ, కుమారి, జిల్లా కార్యదర్శి చిట్టిబాబు పాల్గొన్నారు.

● ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో చేపట్టిన చర్యలు అంతంత మాత్రమే ● నగరపంచాయతీ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ అడబాల నిలదీత

శానిటేషన్ నిర్వహణ లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 27: శానిటేషన్ సక్రమంగా చేయడం లేదు.. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేపట్టడం లేదు.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్నాం.. ఆ స్థాయిలో ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని టీడీపీ కౌన్సిలర్ అడబాల సతీష్‌కుమార్ కౌన్సిల్ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ సమావేశం మంగళవారం చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కౌన్సిలర్ సతీష్ మాట్లాడుతూ పేరుకు నగర పంచాయతీ అయినా సౌకర్యాలు మాత్రం ప్రజలు కల్పించలేకపోతున్నామని ఆవేదన చెందారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ జె.సత్యనారాయణరాజు స్పందించి రోజువారీ కార్మికులు 15మందిని తొలగించడం వల్ల కొద్ది రోజులు పారిశుధ్య సమస్య తలెత్తిందని, మళ్లీ రోజువారీ కార్మికల నియామకానికి అనుమతులు లభించడంతో ఎనిమిది మందిని నియమించామని, పారిశుధ్య సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఫాగింగ్ మిషన్ పనిచేయడం లేదని, మిషన్‌కు మరమ్మతులుచేసి సమస్యను



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ప్రవీణ్‌కుమార్

పరిష్కరిస్తామని ఏఈ పేర్కొన్నారు. నగర పంచాయతీని అభివృద్ధి చేయలేకపోతున్నామని పేర్కొనగా చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ స్పందించి అత్యవసర పనులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తున్నామని, అయితే అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్షాలు కౌన్సిల్ సమావేశంలో అనవసర రాద్ధాంతం చేస్తున్నాయని, వాస్తవానికి మెరుగైన అభివృద్ధి జరిగిందన్నారు. వార్డుల్లో గ్రావెల్‌తో రోడ్డు మరమ్మతులు చేపట్టే పనులు ఎంత వరకు వచ్చాయని కౌన్సిలర్ సతీష్‌కుమార్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డిని ప్రశ్నించారు. దీనిపై చైర్మన్ ప్రవీణ్ కుమార్ స్పందించి అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నాయని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించడం వల్లే ఆ పనులు నిలిపివేశామని, వాస్తవానికి ఆ ఆరోపణలో ఎక్కడా అవినీతి లేదన్నారు. ఆ గ్రావెల్‌తో రోడ్లకు మరమ్మతులు చేస్తే బావుంటుందని సతీష్‌కుమార్ పేర్కొన్నారు. మార్కెట్‌లో వాహనాలు నిలిపే ప్రదేశంలో బహిరంగంగా పశు మాంసాల విక్రయాలు జరుపుతున్నారని సతీష్‌కుమార్ అన్నారు. చేపలు, మాంసం వ్యర్థాలను ప్రధాన రోడ్డుపక్కనే పడవేస్తున్నారని సతీష్‌కుమార్, గంజా శ్రీనివాస్‌లు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. వాటిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. సమావేశంలో వివిధ పనులకు సంబంధించి ఒకటో పద్దు కింద రూ.4,11,136 ఆదాయం రాగా రూ.13,02,204 ఖర్చుగాను, రెండో పద్దు కింద వివిధ పద్దుల నుంచి రూ.3,55,128 ఆదాయం రాగా, రూ.8,02,419 ఖర్చుగాను ప్రవేశపెట్టిన తీర్మానాన్ని కౌన్సిల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు ప్రజలు సిద్ధం: వేగుళ్ల



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన గ్రామస్థులు

రాయవరం, ఫిబ్రవరి 27: రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని, చంద్రబాబు సీఎం కావడం ఖాయమని, టీడీపీ, జనసేన ఘన విజయం సాధించేందుకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారంరాయవరంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగున్నరేళ్ల వైసీపీ అరాచక పాలన సాగిందని, జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాడేపల్లిగూడెంలో జరిగే చంద్రబాబు, పవన్ సభకు మండపేట నియోజకవర్గం నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలిరావలని పిలుపునిచ్చారు. గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే చంద్రబాబు హామీలను ప్రజలకు వివరించారు.

పలువురు టీడీపీలో చేరిక: రాయవరానికి చెందిన టీడీపీ నేత ఉండవిల్లి రాంబాబు ఆధ్వర్యంలో ఎన్.రాజేష్‌రెడ్డి, కె.రాజు, బి.సత్యనారాయణ, వి.మహేష్, వి.రామ శ్రీనివాస్, ఐ.చిరంజీవి, ఆర్.రాజు, ఆర్.నాగేంద్ర, డి.ఏసు, ఈ.అరుణ్, కె.వెంకన్నబాబు, బి.ప్రకాష్, ఎన్.చిన్నబాబు టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు వెలుగుబంట్ల గోపీకృష్ణ, బర్ల రాజు, మచ్చా సూర్యారావు, జుత్తుగ శ్రీను, కందుల గంగరాజు, వల్లూరి శ్రీనివాస్, పాలింగి చిన్నబాబు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండపేట, ఫిబ్రవరి 27: స్థానిక 8వవార్డుకు చెందిన పలువురు మంగళవారం టీడీపీలో చేరారు. వార్డు ఇన్‌చార్జి పెందుర్తి ప్రదీప్‌కుమార్, టీడీపీ ఎస్సీసెల్ కార్యదర్శి మందపల్లి శ్రీనివాసవర్మ ఆధ్వర్యంలో సత్తాల సాయి. బొమ్ము రాము, చాపల కరుణాకర్ టీడీపీలో చేరారు. వారికి వేగుళ్ల కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు టీడీపీలో చేరారు. వచ్చే ఎన్ని కల్లో టీడీపీ, జనసేన విజయం కోసం కృషిచేయాలని వేగుళ్ల కోరారు.

బుచ్చిబాబుకు పీఎంపీల అభినందన

ఐ.పోలవరం, ఫిబ్రవరి 27: టీడీపీ-జనసేన కూటమి ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును ప్రకటించడంపై మండల పీఎంపీ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం అసోసియేషన్ సభ్యులు మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో బుచ్చిబాబును కలిసి అభినందించారు. ఆయన విజయానికి కృషి చేస్తామన్నారు. తనను ఆశీర్వదించాలని బుచ్చిబాబు కోరారు. కార్యక్రమంలో గుత్తుల సాయి, ఏలూరి మూర్తి, అసోసియేషన్ అధ్యక్షుడు గంగాధరం, కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉంగరాల వీరేశ్వరరావు, సత్తిబాబు, ఏడుకొండలు, భూషణం, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



ఆలమూరు, ఫిబ్రవరి 27: జొన్నాడకు చెందిన జనిపల్లి సుబ్రహ్మణ్యం, వీరి కృష్ణ, ఎరుబండి ప్రశాంత్, నాయుడు, ఉండమట్ల అబ్బన్న, రొక్కల సత్యనారాయణ, తలారి వెంకన్న వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. వారికి ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తాడి శ్రీనివాసరెడ్డి, గొడవర్తి బాబీ, నామాల సూరిబాబు, వీరి గోపి, వీరి రాజు, తమలంపూడి కృష్ణారెడ్డి, మడ్డి సత్యనారాయణరెడ్డి, మెర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాడపాలెంలో బండారు ప్రచారం



కొత్తపేట, ఫిబ్రవరి 27: టీడీపీ-జనసేన కొత్తపేట నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యానందరావు తనను గెలిపించాలంటూ స్వగ్రామం వాడపాలెంలో మంగళవారం ప్రచారంనిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మీ ఆశీస్సులు కావాలని కోరారు. రజకుల బల్లపూజ సందర్భంగా సత్తెమ్మ అమ్మవారి సంబరంలో టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి బండారు పాల్గొన్నారు. వాడపాలెం సర్పంచ్ త్సామా బాబు, బండారు వీరబాబు, కడియం చిన్న పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫ్యూజన్ 2కే 24 ప్రదర్శనలు

రామచంద్రపురం, ఫిబ్రవరి 27: రామచంద్రపురం వీఎస్ఎం కళాశాలలో ఏర్పాటుచేసిన సైన్సు ఫ్యూజన్ 24 భిన్నమైన ప్రాజెక్టుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మంగళవారం విద్యాసంస్థల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్‌మూర్తి జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని సైన్సు ఫెస్టు ను ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన సైన్సు ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ఎన్ ఆలీ అన్సారీ, హెచ్ఓడీలు ఆర్.నాగేశ్వరరావు, ఎం.ఫణికుమార్, ఎన్ఎల్ఎస్ మల్లిక, కేవీవీఎస్ చౌదరి, ఎ.చంద్రావతి, ఎ.వెంకటలక్ష్మి, ఎ.రాంబాబు, డా.సీహెచ్ మహేష్, ర్యాలీ శ్రీనివాస్, లైబ్రేరియన్ సీహెచ్ రామకృష పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన సభను విజయవంతం చేయాలి



ముమ్మిడివరం: సమావేశంలో మాట్లాడుతున్న గొలకోటి దొరబాబు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 27: తాడేపల్లిగూడెంలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ బుధవారం నిర్వహించే రా.. కదలిరా.. బహిరంగ సభను విజయవంతం చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అర్థాని శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడారు. బహిరంగ సభకు బుధవారం పార్టీ కార్యాలయం నుంచి బస్సులు, కార్లలో ఉదయం 12 గంటలకు బయలుదేరి తరలివెళ్లాలన్నారు. సమావేశంలో గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, పొత్తూరి విజయభాస్కరవర్మ, నడిమింటి సూర్యప్రభాకరం, తాడి జానకీరామ్, చిక్కాల అంజిబాబు, పిల్లి నాగరాజు, విళ్ల వీరాస్వామినాయుడు, గొల్లపల్లి గోపి, రంకిరెడ్డి రాంబాబు, బొంతు నాగరాజు, యాళ్ల ఉదయ్, కురసాల శివ, బొక్కా రుక్మిణి, వాసంశెట్టి అమ్మాజీ, ముమ్మిడివరపు వరలక్ష్మి, కుడుపూడి మల్లేశ్వరి, కుంచనపల్లి వెంకన్నబాబు, మట్ట సత్తిబాబు పాల్గొన్నారు.

వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం.. నేడు చలో తాడేపల్లిగూడెం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే లక్ష్యంతో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో చేపట్టిన జెండా బహిరంగ సభను విజయవంతం చేయాలని జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్ పిలుపునిచ్చారు. బుధవారం జరిగే చలో తాడేపల్లిగూడెం బహిరంగ సభ ద్వారా పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు, నల్లా శ్రీధర్, యాళ్ల నాగసతీష్, కొప్పుల నాగమానస, ఆర్డీఎస్ ప్రసాద్, బట్టు పండు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ-జనసేన బ



అమలాపురం: చలో తాడేపల్లిగూడెం పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జనసేన పార్లమెంటు ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్

హిరంగ సభను విజయవంతం చేయాలని రాజోలు నియోజకవర్గ టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం లక్కవరంలో ఎంజీ గార్డెన్స్‌లో పార్టీ మండల అధ్యక్షుడు అడబాల యుగంధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ పరిశీలకులు చిటికెల రామ్మోహనరావు, బహిరంగ సభ మొబలైజేషన్ పరిశీలకుడు కడలి గోపి పాల్గొన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ బహిరంగ సభకు టీడీపీ, జనసేన పార్టీల నుంచి 150వాహనాల్లో వెళ్లడానికి తీర్మానించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అందరూ దిండి చెక్ పోస్టు వద్దకు చేరాలన్నారు. కార్యక్రమంలో గుబ్బల శ్రీనివాస్, ముప్పర్తి నాని, రాపాక నవరత్నం, చాగంటి స్వామి, తాడి సత్యనారాయణ, దోనిపాటి రాజు, అల్లూరి మోహన్‌రాజు, ముదునూరి రాంబాబురాజు, కడలి కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఉమ్మడి బహిరంగ సభకు భారీగా తరలివెళ్లాలి

పి.గన్నవరం, ఫిబ్రవరి 27: తాడేపల్లిగుడెంలో బుధవారం జరగనున్న టీడీపీ-జనసేన ఉమ్మడి బహిరంగ సభకు భారీగా తరలివెళ్లాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ గిడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. పి.గన్నవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసైనికులు, వీర మహిళలు అధికసంఖ్యలో వెళ్లాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ పతనమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి వాసంశెట్టి కుమార్, మండల పార్టీ అధ్యక్షులు సాధనాల శ్రీవెంకటసత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, అడబాల తాతకాపు, యడ్ల ఏసుభాస్కరావు, తాటికాయల వెంకటేష్, నెరెడిమిల్లి రఘు, తాటికాలయల శ్రీనివాసరావు, కోట రాజేంద్ర, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం



ఆలమూరు, ఫిబ్రవరి 27: కొత్తపేట సీటును జనసేనకు కేటాయించకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేసి ఆలమూరులో పవన్ కల్యాణ్ ఫ్లెక్సీని ధ్వంసం చేసిన ఆయన అభిమానులు మంగళవారం జనసేన అధినేత చిత్రపటానికి పాలభిషేకం చేశారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని నాయకులు చల్లా బాబీ, గుత్తుల నాగేశ్వరరావు చెప్పారు.నాయకులు సంగిత సుభాష్, తాళ్ల డేవిడ్, తోట వెంకటేశ్వర్లు, గంటా స్వయంప్రకాష్ పాల్గొన్నారు.

వేగుళ్లకు అభినందనల వెల్లువ

మండపేట, ఫిబ్రవరి27: టీడీపీ, జనసేన నియోజకవర్గం అభ్యర్థిగా ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును ప్రకటించిన నేపథ్యంలో మంగళవారం నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన టీడీపీ శ్రేణులు వేగుళ్లను కలిసి పూలమాలతో సత్కరించారు. నాల్గవసారి అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామని వారు చెప్పారు.

స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు అమూల్యం

అయినవిల్లి, ఫిబ్రవరి 27: ప్రకృతి వైపరీత్యాల సమయంలో సమాజానికి, ప్రజలకు సేవలు అందించేది స్వచ్ఛంద సంస్థలేనని ప్రముఖ నాయకుడు నిమ్మకాయల జగ్గయ్యనాయుడు పేర్కొన్నారు. ప్రపంచ స్వచ్ఛంద సేవాసంస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని విలస గ్రామంలో మంగళవారం మన్నా మినిస్ట్రీస్ న్యూలైఫ్ సెంటర్‌లో జీఎంసీ బాలయోగి చారిటబుల్ సొసైటీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ అక్కిశెట్టి దుర్గారావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన మాట్లాడారు. 1999లో అప్పటి లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి నేతృత్వంలో జగ్గయ్యనాయుడు గౌరవాధ్యక్షుడిగా ఎటువంటి విరాళాలు సేకరించకుండా ఎన్నో సామాజిక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వ్యవస్థాప అధ్యక్షుడు గంగుమళ్ల శ్రీనివాస్ తెలిపారు. అబ్బిరెడ్డి రామదాసు ఫౌండేషన్ ట్రస్టు అధ్యక్షుడు అబ్బిరెడ్డి సురేష్ మాట్లాడారు. కుష్ఠు వ్యాధి గ్రస్తులకు నూతన వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ మీరాసాహెబ్, మాజీ జడ్పీటీసీ గంగుమళ్ల కాశీ అన్నపూర్ణ, శిరంగు దొరబాబు, అబ్బిరెడ్డి మూర్తి, ఆకుల ఈశ్వరరావు, వల్లభరెడ్డి వాసు, బండారు పరమేష్, అమలకట్ట వెంకన్న, అక్కిశెట్టి సాయి, అల్లం అబి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

మామిడికుదురు, ఫిబ్రవరి 27: మామిడికుదురులో విశ్రాంత జాయింట్ సెక్రటరీ వాసంశెట్టి సత్యనారాయణమూర్తి నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి నూతన ఆలయ విగ్రహ శిఖర ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం వాసంశెట్టి వెంకటరమాకాంత్ కవితా దంపతులు కర్తలుగా పాల్గొని విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అంకురార్పణ, గోపూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, బాణసంచా కాల్పుల నడుమ 108 కలశాలతో విగ్రహాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గురువారం ఉదయం స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

జగనన్న ఆరోగ్యశ్రీ శిబిరాన్ని అడ్డుకున్న సర్పంచ్

రెండు గంటలు ఆలస్యంగా క్యాంపు ప్రారంభం

అంబాజీపేట, ఫిబ్రవరి 27: పంచాయతీ కార్యదర్శి నుంచి తనకు ఎటువంటి సమాచారం లేదని కె.పెదపూడిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యశ్రీ శిబిరాన్ని సర్పంచ్ బీర శాంతి, వార్డు సభ్యుడు బీర రాజారావు అడ్డుకున్నారు. పంచాయతీ కార్యదర్శి విత్తనాల వెంకటరమణ క్యాంపు వద్దకు వచ్చే వరకూ శిబిరాన్ని ప్రారంభించవద్దని వైద్యశాఖ అధికారులను అడ్డుకున్నారు. దీంతో శిబిరం వద్దకు వచ్చిన రోగులు, గ్రామస్థులు సర్పంచ్, వార్డు సభ్యుడు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యదర్శి కోసం క్యాంపు ఆపడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో జడ్పీటీసీ బూడిద వరలక్ష్మి సర్పంచ్, వార్డు సభ్యుడితో మాట్లాడి క్యాంపు రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభించారు. ఆరోగ్య శిబిరం వద్దకు వచ్చిన వృద్ధులు, రోగులు నానా ఇబ్బందులు పడ్డారు. వైద్య శిబిరం వద్ద పంచాయతీ ఆధ్వర్యంలో ఎటువంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో స్థానికులే టెంట్లు, టీ, భోజనాలు ఏర్పాటు చేసినట్లు స్థానికులు తెలిపారు.

పోలింగ్ నిర్వహణపై శిక్షణ

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆర్డీవో కార్యాలయంలో మంగళవారం మహిళా ఉపాధ్యాయులకు అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్లగా సరిదే సత్యపల్లంరాజు, కొంపెల్ల వీవీఎస్ శర్మ వ్యవహరించగా విద్యాశాఖ, రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో ఈవీఎంల నిర్వహణ, వీవీ ప్యాట్లపై అవగాహన కల్పించారు. మాక్ పోలింగ్ ఏవిధంగా నిర్వహించాలో తెలిపారు. మాక్ పోలింగ్ అనంతరం వీవీ ప్యాట్‌లోని స్లిప్పులను భద్రపరిచే విధానాన్ని తెలియజేశారు. ఎన్నికల విధులు నిర్వహించే పీవో, ఏపీఐ, ఓపీవో విధులు, పీవో డైరీ, చాలెంజ్ ఓటు, టెండరు ఓటు తదితర అంశాలను వివరించారు. మాక్ పోలింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు.

ఆకట్టుకున్న పశువులు, కోళ్ల ప్రదర్శన

యానాం, ఫిబ్రవరి 27: యానాం ఆసుపత్రి ఆవరణలో పశుగాణాభివృద్ధి, పశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పశువులు, కోళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. పశువైద్యాధికారి డాక్టర్ కె.ఎంద్రూజబకుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. యానాంలోని మేలు జాతి, ఆవులు, గేదెలు, పెయ్యలు, గొర్రెలు, పెంపుడు పశువుల పునత్పత్తి పుస్తకాలను, పెంపుడు శుకనాలను ప్రదర్శించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి మునిస్వామిలు విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయనిర్ణేతులగా సీహెచ్ శ్రీరామ్, ఎం.వెంకటరణలు వ్యవహరించారు.

మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 27: పోషక విలువలు కలిగిన మత్స్య సంపద అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ పేర్కొన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద చేపల తరలింపు కోసం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన పథకం కింద చింతా శ్రీనివాసరావుకు రూ.23లక్షలతో మంజూరైన శీతలీకరణ ఇన్సులేటెడ్ వాహనాన్ని మంత్రి ప్రారంభించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు, మత్స్య అభివృద్ధి అధికారి అశ్వినీసత్య పాల్గొన్నారు.

లేబర్ లైసెన్సులపై అవగాహన

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: కార్మిక శాఖ కార్యాలయంలో మంగళవారం ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార సంఘాల ప్రతినిధులతో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ టి.నాగలక్ష్మి సమావేశం నిర్వహించారు. వ్యాపార సంస్థల లైసెన్సు రెన్యువల్, కొత్త లైసెన్సులు, వర్కర్స్ వెల్ఫేర్ ఫండ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, కొవ్వూరి వెంకటరెడ్డి, కంచిపల్లి అబ్బులు, మేడిచర్ల త్రిమూర్తులు, చింతలపూడి సత్తిబాబు, వలవల శివరావు, తటవర్తి నాగేశ్వరరావు, అనుపోజు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.1,11,116

ఆత్రేయపురం, ఫిబ్రవరి 27: కోనసీమతిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన నడింపల్లి సత్యనారాయణరాజు-లీల దంపతులు రూ.1,11,116 విరాళం సమర్పించారు. మంగళవారం వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.1,36,128 లభించినట్టు ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ పూజలు

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 27: వల్లూరు శ్రీభూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెండో రోజు మంగళవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠ పూజలు ఘనంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, నవచతుర్థశ కలశారాధన, పంచగవ్య ప్రాసన, వాస్తు మండపారాధన, ప్రధాన హోమాలు తదితర పూజాకార్యక్రమాలను వేదపండితులు వేదమంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగానిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం, సాయంత్రం విశ్వక్సేనపూజ, అగ్నిమధనం, కుంభపూజ, మహాశాంతిహోమం జరిపారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

నామనకు రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శ



మామిడికుదురు, ఫిబ్రవరి 27: సతీ వియోగంతో బాధపడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబును శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం పరామర్శించారు. రాంబాబు సతీమణి కృష్ణవేణి భౌతికకాయానికి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. రాంబాబు-కృష్ణవేణిల తనయుడు వినోద్ అమెరికా నుంచి రావడంతో కృష్ణవేణి అంత్యక్రియలు మగటపల్లిలోని శ్మశానవాటికలో మంగళవారం నిర్వహించారు. రాంబాబును టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నాయకులు, అభిమానులు పరామర్శించారు.

అందాల చందమామ షార్ట్ ఫిల్మ్ ప్రారంభం

అంతర్వేది, ఫిబ్రవరి 27: పీటీ స్క్రీన్ బ్యానర్‌పై మహేష్ ఊటుకూరి నిర్మాణ సారథ్యంలో తిరునగరి ప్రవీణ్ దర్శకత్వంలో రూపొందించే అందమైన చందమామ షార్ట్ ఫిల్మ్ మంగళవారం అంతర్వేదిలో ప్రారంభమైంది. శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీ చైర్మన్, సినీ పాటల రచయిత డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కొబ్బరికాయ కొట్టి ముహూర్తపు షాట్‌ను ప్రారంభించారు. స్థానికంగా మంచి నటీనటులు, టెక్నీషియన్లు ఉన్నారని, టాలెంట్ ఉంటే ఎప్పటికైనా మంచి గుర్తింపు వస్తుందన్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే షార్ట్ ఫిల్మ్‌లో ప్రత్యేకమైన సాంగ్‌ను అంతర్వేది పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించారు. ఇందులో దుర్గాభవానీ, అనూష, దత్తాత్రేయలు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా మహేష్ ఊటుకూరి పాటలు, కెమెరా శైలేంద్ర(మిస్టర్ బ్లాక్) వ్యవహరిస్తున్నారన్నారు. మోరం నాయుడు, కుసుమ రాకేష్, వెంకట్రావు, చిన్నుబాబు పాల్గొన్నారు.

రాంబాబుకు ఎక్సలెన్సీ అవార్డు

అమలాపురంటౌన్, ఫిబ్రవరి27: నూతన సాంకేతిక పరిజ్ఞానంతో రోడ్లు, వంతెనలు నిర్మిస్తున్న పంచాయతీరాజ్ డీఈ అన్యం రాంబాబును ఎక్సలెన్సీ అవార్డువరించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగినకార్యక్రమంలో ఆయనకు ఈఅవార్డును తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గెడ్డం ప్రసాద్ అందజేసి సత్కరించారు. రాంబాబును మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, నాయకులు మెట్ల రమణబాబు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఈఈ కె.చంటిబాబు అభినందించారు.

ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా వెంకటేశ్వరి



పి.గన్నవరం, ఫిబ్రవరి 27: పి.గన్నవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవోగా డి.వెంకటేశ్వరి బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం ఐసీడీఎస్‌కు ఇన్‌చార్జి పీడీగా పనిచేసి డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు సీడీపీవోగా పనిచేసిన విజయశ్రీ అమలాపురం ప్రాజెక్టుకు వెళ్లారు. వెంకటేశ్వరికి కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ యూనియన్ నేతలు, అంగన్‌వాడీలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జీడి గింజల ఒలుపు కార్మికులను ఆదుకోవాలి

మలికిపురం, ఫిబ్రవరి 27: జీడి గింజల ఒలుపు కార్మికులను ఆదుకోవాలని జనసేన రాజోలు నియోజకవర్గ నాయకుడు డాక్టర్ రాపాక రమేష్‌బాబు అన్నారు. మంగళవారం మోరి తదితర ప్రాంతాల్లో పర్యటించి జీడి గింజల ఒలుపు కార్మికులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి టీడీపీ, పవన్‌కల్యాణ్ నాయకత్వాన్ని బలపరచాలన్నారు. కార్యక్రమంలో పినిశెట్టి బుజ్జి, గుబ్బల ఫణికుమార్, రావూరి నాగు, ఉండపల్లి అంజి, జక్కంపూడి శ్రీదేవి, బైరా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీకి ఫ్రీజర్ అందజేత

ఐ.పోలవరం, ఫిబ్రవరి 27: జి.వేమవరం పీహెచ్‌సీకి గ్రామానికి చెందిన బసవా సింహాద్రిరావు(బుజ్జి) రూ.లక్ష విలువైన ఫ్రీజర్‌ను అందించారు. జడ్పీటీసీ సతీష్‌రాజు, స్థానిక సర్పంచ్ నల్ల సుదర్శనరావు, గుత్తెనదీవి సర్పంచ్ లంకలపల్లి మునిరాజుబుల్లియ్య, గ్రామ పెద్దలు మంగళవారంఫ్రీజర్‌ను పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఇందిరకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మెండా వెంకటేశ్వరరావు, మాజీ చైర్మన్ కె.విజయబాబు, పెంటా రవి, చోడిశెట్టి బుల్లియ్య, పడాల తాతయ్యకాపు, చిక్కాల సత్తిబాబు, గాలిదేవర రాజబాబు, గాలిదేవర పెద్దకాపు, ఆకుల సత్తిబాబు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమల సర్వే నిర్వహించాలి

అల్లవరం, ఫిబ్రవరి 27: సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి పరిశ్రమల సర్వే నిర్వహించాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ సూచించారు. అల్లవరంలో జరిగిన శిక్షణలో పాల సేకరణ ప్రారంభానికి సత్వర చర్యలు చేపట్టాలని ఏపీఎం సయ్యద్‌కు సూచించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎంలు పాల్గొన్నారు.

నేషనల్ లోక్ అదాలత్ 16కు వాయిదా

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 27: మార్చి 9న జరగాల్సిన నేషనల్ లోక్ అదాలత్‌ను మహాశివరాత్రి కారణంగా 16వ తేదీకి వాయిదా వేసినట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, అమలాపురం 2వ అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు. వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్ బౌన్స్ కేసులతో పాటు రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈఅదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఉదయం 10.30గంటల నుంచి జరిగే అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని కోరారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా న్యాయవాదులతో పాటు పోలీసు, బ్యాంకు, రెవెన్యూ అధికారులు సహకరించాలని కోరారు.

కేన్సర్ వ్యాధిగ్రస్తుడికి రక్తదానం

కొత్తపేట, ఫిబ్రవరి27:కొత్తపేట స్వామివివేకానంద యోగాశ్రమానికి చెందిన 10మంది విద్యార్థులు కేన్సర్ వ్యాధిగ్రస్తుడైన అయినవిల్లి మండలం వెలవెలపల్లికి చెందిన చిటికెన దుర్గాప్రసాద్‌కు రక్తదానం చేసినట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. రక్తదాతలను పలువురు అభినందించారు.

విగ్రహాల ప్రతిష్ఠ పూజలు

అల్లవరం, ఫిబ్రవరి 27: తాడికోన రామాలయంలో విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా వేదపండితుల మంత్రోచ్చారణలతో హోమాలు, పూజలు జరిగాయి. శిరంగు సత్యనారాయణ-లక్ష్మి దంపతులు కర్తలుగా వైఖానస ఆగమ మహదాచార్య సుదర్శనం వెంకటాజనార్దనాచార్యులు ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించారు. బుధవారం పూర్ణాహుతి, సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ, భారీ అన్నసమారాధన జరుగుతాయని కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు మున్సిపల్ సమావేశం

మండపేట, ఫిబ్రవరి 27: మండపేట మున్సిపల్ సాధారణ సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు.

వలంటీర్లకు సన్మానం

అల్లవరం, ఫిబ్రవరి 27: దేవగుప్తం పంచాయతీ వద్ద మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు సాధనాల వెంకట్రావు వలంటీర్లను సన్మానించారు. పంచాయతీ కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: సుందరం మాస్టర్
వెంకటరమణ	: ఈగల్
శ్రీలలిత	: సిద్ధార్థరాయ్
శేఖర్ స్క్రీన్-1	: హనుమాన్
శేఖర్ స్క్రీన్-2	: ముఖ్య గమనిక
రమా	: గుంటూరు కారం
గణపతి	: ఐ హేట్ లవ్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: ఊరుపేరు భైరవకోన
వెంకటపద్మావతి స్క్రీన్-2	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండు

కుళాయిల ఏర్పాటుకు భూమి పూజ

అల్లవరం, ఫిబ్రవరి 27: గుండెపూడి పల్లిపాలెంలోని మత్స్యకార నివాస ప్రాంతాలకు సర్పంచ్ గుంటూరి కృష్ణంరాజు సొంత నిధులు రూ.4.50లక్షలతో మంచి నీటి కుళాయిల పనులకు భూమి పూజ చేశారు. ఎంపీటీసీ మాకే కృష్ణమూర్తి, పోతుల రఘు, జి.కృష్ణంరాజు, పినిపే ప్రకాశరావు, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. గోడితిప్ప పంచాయతీ పరిధిలో నిర్మించిన సీసీ రోడ్లను సర్పంచ్ చిట్టినీడి శ్రీదేవి ప్రారంభించారు. యెంట్రుకోనలో రూ.9.60 లక్షలతో చెరువు ఉపాధి పనులను సర్పంచ్ తిక్కిరెడ్డి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏపీవో వి.శ్రీనుబాబు, కార్యదర్శి అడబాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

మాదిగలకు సీట్లు కేటాయించకపోవడం దారుణం

అంబాజీపేటలో మాదిగల సామాజికవర్గ సమావేశం

అంబాజీపేట, ఫిబ్రవరి 27: అమలాపురం పార్లమెంటర్ పరిధిలో ఉన్న ఎస్సీ రిజర్వడ్ స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దారుణమని మాదిగలు మండిపడ్డారు. అంబాజీపేటలో వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుట్టుగుళ్ళ కిషోర్ అధ్యక్షతన మాదిగ సామాజికవర్గ సమావేశం మంగళవారం నిర్వహించారు. మాదిగలు ఎప్పుడు టీడీపీ వెంటే ఉంటామన్నారు. పార్లమెంట్‌లో ఉన్న అసెంబ్లీ స్థానాల్లో ఏదో ఒక సీటు మాదిగలకు కేటాయించే విధంగా అధిష్టానం పునరాలోచించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ హెచ్ఆర్‌డీ సభ్యుడు నేదునూరి వీర్రాజు, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, నేదునూరి వెంకటరమణబాబు, సవరపు శ్రీనివాసరావు, పెదపూడి రాము, మంద రాజేష్, నేదునూరి పెద్దిరాజు, మంద నాగరాజు తదితరులు పాల్గొన్నారు.